క్లుప్తంగా

సర్వే పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో డయాబెటిక్, హైపర్‌టెన్షన్‌లపై పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వేను శుక్రవారం ప్రోగ్రాం అధికారిణి శిరీష పరిశీలించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో వారికి మందులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఆస్మ అఫ్షిన్, సూపర్‌వైజర్ నక్షత్ర, సీహెచ్‌వో నాగరాజు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మొక్కజొన్న శాస్త్రవేత్తలు నాగేశ్వర్, మల్లయ్య, వాణి శుక్రవారం పర్యటించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అధిక వర్షాల వల్ల మొక్కజొన్న పైరు పెరగలేదని, కత్తెర పురుగు ఆశించిదని గుర్తించారు. పైరు ఎదుగుదలకు, కత్తెర పురుగు, కలుపు మొక్కల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించినట్లు ఏవో నరేష్ తెలిపారు. ఏఈవో కరుణేశ్వర్, రైతులున్నారు.

కృష్ణాజీవాడిలో..

తాడ్వాయి (ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడి, దేవాయిపల్లి శివారులోని పంటలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలను పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంవీ నగేష్ కుమార్, డాక్టర్ మల్లయ్య, వాణిశ్రీ, ఏడీఏ రత్న, ఏవో శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎల్లారెడ్డి: లింగంపేట మండలంలోని ఎక్కపల్లి గ్రామస్తులను బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అడవులను అక్రమంగా నరకడంతో పాటు, పోలీసులు, అటవీశాఖ సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంతో వారిని కోర్టు ఆవరణలో మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు.

గాలి గోపుర నిర్మాణానికి విరాళం అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ ముందర భాగంలో నూతనంగా నిర్మిస్తున్న గాలి గోపుర నిర్మాణానికి బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ.లక్షా 16 వేల నగదును విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆయన విరాళం అందజేయగా, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల సర్వే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి గ్రామంలో శుక్రవారం కార్యదర్శి ప్రదీప్ ఇంటింటికి తిరిగి అనాథ పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రదీప్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇద్దరు పిల్లలను గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్ ,అంగన్‌వాడి టీచర్లు స్వరూప, చంద్రకళ ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



భిక్కనూరు: కంచర్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టేషనరీని మెజీషియన్ సంతోష్ శుక్రవారం పంపిణీ చేశారు. 80 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులతో పాటు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, పాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నేతలు లక్ష్మారెడ్డి, హరీష్, ఉదయ్ పాల్గొన్నారు.

వినూత్నంగా స్వీపర్ల నిరసన

కామారెడ్డి రూరల్: ఓం కేసీఆరాయ నమః అంటూ జప మాల చేతబట్టి పార్ట్‌టైం స్వీపర్లు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 47వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం చెల్లించాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైం స్వీపర్లు బాలయ్య, శివలింగం, గంగయ్య, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

కిష్కింధ కాండ

- ఇళ్లల్లోకి చొరబడి నానా బీభత్సం చేస్తోన్న వానరాలు
- భయంభయంగా బతుకుతున్న స్థానికులు

మాచారెడ్డి: ఎక్కడ చూసినా వానరాలు గుంపులు గుంపులుగా చేరి జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. వస్తువులను చిందర వందరగా పడేస్తున్నాయి. చిన్న చిన్న వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుపడితే దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఐదు రోజుల కిందట గజ్యా నాయక్ తండా చౌరస్తాకు చెందిన జనపాల నారాయణ అనే యువకుడు ఆరు బయట సేదదీరుతుండగా ఇంట్లోకి వస్తున్న కోతుల గుంపును అడ్డుకోబోయాడు. అంతే గుంపులో నుంచి రెండు కోతులు నారాయణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. అదే గ్రామానికి చెందిన సుంకోజి తిరుపతి అనే వ్యక్తి ఇంటి ముందు గుంపులుగా ఉన్న కోతుల దండును చెదరగొట్టే యత్నం చేశాడు. దాంతో రెచ్చి పోయిన వానర దండు ఆయనపై దాడి చేయగా పరుగెత్తుకుంటూ వెళ్లడంతో కిందపడ్డాడు. కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. తిరుపతిపై దాడి చేసిన మరుసటి రోజే ఆయన ఇంటి పక్కన నివాసముంటున్న బుజ్జి అనే మహిళపై దాడి చేయగా తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చేరింది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలో కోతుల దాడిలో గాయపడ్డ ఘటనలు కోకొల్లలు.

సత్ఫలితాలివ్వని మంకీఫుడ్ కోర్టులు..

అడవులను విచ్చవిడిగా నరికి వేయడంతో కోతులు ఆహారం కోసం గ్రామాల్లోకి ప్రవేశించి దాడులు చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మంకీఫుడ్ కోర్టుల పేరిట పండ్ల మొక్కలను నాటి కోతుల బెడద నుంచి ప్రజల్ని కాపాడాలని నిర్ణయం తీసుకుంది. కానీ మండలంలోని అక్కాపూర్, లచ్చాపేట, రత్నగిరిపల్లి మినహా అన్ని గ్రామాల్లో పండ్ల మొక్కలను ఆ కోతులే ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే అధికారుల పర్యవేక్షణ లోపంతో సత్ఫలితాలివ్వక కోతులు దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.



చౌరస్తాలోని ఓ దుకాణం వద్ద కూర్చున్న కోతులు

రూ.60 వేలు ఖర్చయ్యాయి



కోతులు దాడి చేయడంతో కాలు విరిగి రూ.60 వేలు ఖర్చయ్యాయి. మూడు నెలలు ఇంటి వద్దనే ఉండాల్సి వచ్చింది. ఇప్పటికీ కోతుల బెడద తప్ప లేదు. భయం భయంగా బతకాల్సి వస్తోంది.

– సుంకోజి తిరుపతి, గజ్యానాయక్ తండా చౌరస్తా

బయటకు పోవాలంటే భయమేస్తోంది



నాపై కోతులు దాడి చేసి గాయపర్చిన నాటి నుంచి బయటకు పోవాలంటే భయమేస్తోంది. బయటకు పోతే కోతులు ఎప్పుడు వచ్చి దాడి చేస్తాయోనని భయంతో వణికిపోవాల్సి వస్తోంది.

– జనపాల నారాయణ, స్థానికుడు

సామాన్లు ఎత్తుకుపోతున్నాయ్



ఇంటి తలుపులు తీస్తే చాలు ఇంట్లోకి వచ్చి సామాన్లు ఎత్తేస్తున్నాయ్. చేతికి అందిన వస్తువులు ఎత్తుకెళ్లి బయట పడేస్తున్నాయి. ఏమన్నా అంటే మీది మీదికి ఉరికి వచ్చి కరుస్తున్నాయి. ఏం జేయల్నో అర్థం కావడం లేదు.

– బుజ్జి, స్థానికురాలు

ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కలు నాటాలి

రాజంపేట: ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కలు నాటేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 23 ఏళ్ల లోపు అనాథలను గుర్తించాలని సూచించారు. అదే విధంగా గ్రామంలో మురుగు నిల్వ ఉన్న చోట సోక్‌పీట్లను నిర్మించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

గుంతలు లోతుగా తీయించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హరితహారంలో భాగంగా కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటేందుకు గుంతలను లోతుగా తీయించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. మాసాన్‌పల్లి, ఆత్మకూర్ గ్రామాలలో కమ్యూనిటీ ప్లాంటేషన్ కోసం తీస్తున్న గుంతలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో ఆయన మాట్లాడారు. గుంతలను లోతుగా తీయడంతో పాటు మొక్కలను నాటిన తర్వాత చుట్టూ పాదుకలను చేయాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. మాసాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

ఆభరణాల తయారీపై శిక్షణ



భిక్కనూరు: ఆభరణాల తయారీపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్వాపూర్ గ్రామంలో మహిళలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ మంజుల మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు గాజుల తయారీ, రాఖీల తయారీలను నేర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి భూపతి, ట్రైనర్ నీరజ, శ్రీనివాస్, మహిళ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



బాన్సువాడ: కోటగిరికి చెందిన పలువురు శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని, క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు. అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్, రూ. 2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ముజీబ్, పీరు, ఇంతియాజ్, అయ్యుబ్ అహ్మద ఫాహిమ్, జమల్, అఖిల్, సలీం తదితరులు పార్టీలో చేరారు.

టీకాల విషయంలో అశ్రద్ధ చేయొద్దు

బాన్సువాడ రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు టీకాల విషయంలో అశ్రద్ధ చేయొద్దని మిషన్ ఇంద్రధనస్సు కన్సల్టెంట్ ఫణి సూచించారు. శుక్రవారం ఆయన హన్మాజీపేట్ పీహెచ్‌సీ పరిధిలోని తిర్మలాపూర్, తాడ్కోల్, దేశాయిపేట్ గ్రామాల్లో పర్యటించి ఇమ్యునైజేషన్‌ను పరిశీలించారు. టీకాలు తీసుకోని వారిని గుర్తించి ఇంటింటికి వెళ్లి టీకాలు వేయాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. సబ్‌సెంటర్‌లోని రికార్డులు పరిశీలించారు. టీకాల విషయంలో తల్లులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సాయిలు, రాంచందర్, ఏఎన్‌ఎంలు కల్పన, పద్మ శ్రావణి, యశోద రాజు, ఆశావర్కర్లు రమాదేవి, విమలు స్వరూప, సునీత తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఫణి

సర్దార్ పాపన్న జయంతి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడలో ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నేతలు



పెద్దకొడప్‌గల్‌లో జై గౌడ సంఘం ఆధ్వర్యంలో..



మద్నూర్‌లో జైగౌడ సంఘం ఆధ్వర్యంలో..

బాన్సువాడ/పెద్దకొడప్‌గల్/మద్నూర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం బాన్సువాడ, పెద్దకొడప్‌గల్, మద్నూర్ మండలాల్లో గౌడ సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఈ నెల 13న రవీంద్ర భారతి(హైదరాబాద్)లో పాపన్న జయంత్యుత్సవాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. గౌడ సంఘం సభ్యులు, ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

‘హాథ్ సే హాథ్ జోడో’ విజయవంతం చేయాలి

రాజంపేట: మండల కేంద్రంలో ఆదివారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించే ‘హాథ్ సే హాథ్ జోడో’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యాదవరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు షబ్బీర్ అలీ, పార్టీ జెండాను ఆవిష్కరణ చేసి అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నేతలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నిధులు మంజూరు చేయించి బోరు బావులు తవ్వించడం అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమల్లారెడ్డిలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు చేసిన నిధులతో రెండు బోరు బావులను తవ్వించారు.విండో చైర్మన్ రాజాగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు కోదూరి సాయగౌడ్, గ్రామపంచాయతీ కో-ఆప్షన్ సభ్యుడు సతీష్‌రెడ్డి, నేతలు రాజలింగం, భూమయ్య, బ్రహ్మచారీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో శుక్రవారం జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మహమ్మద్‌నగర్, హసన్‌పల్లి, ఆరేడ్, మల్లూర్, తున్కిపల్లి గ్రామాల్లోని 9 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సర్పంచులు లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి ఉన్నారు.

గౌతమ బుద్ధుడు అందరికి స్ఫూర్తి



ఎల్లారెడ్డి పట్టణంలోని 8వవార్డు ప్రకృతి వనంలో బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: గౌతమ బుద్ధుడు అందరికి స్ఫూర్తిదాయకమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని 8వ వార్డు పట్టణ ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రపతి అవార్డు గ్రహీతలైన నునుగొండ వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమార్తె విజయలక్ష్మి ప్రకృతి వనంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ నునుగొండ భూదేవి, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం రావు, బీఆర్‌ఎస్ నాయకులు తానాజీరావు, సతీష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణ శివారులోని జీవదాన్ పాఠశాల ఆవరణలో ఈనెల 14న నిర్వహించనున్న మంత్రి కేటీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించాలి

- అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వంద శాతం విముక్తి పొందవచ్చని అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అన్నారు. శుక్రవారం రామారెడ్డి మండల కేంద్రంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, జీజీహెచ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వడ్లూర్ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్ష, అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. రామారెడ్డి రైతు వేదికలో ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు 400 మంది రైతులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రాథమిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అమ్ముల పశుపతి, రామారెడ్డి ఉప సర్పంచ్ పోతునూరి ప్రసాద్, డైరెక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చికెన్ వ్యర్థాల్ని వేయకుండా చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చికెన్ దుకాణాల యజమానులు వ్యర్థాలను వేస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. చాలా రోజులుగా పాఠశాల ఆవరణలో చికెన్ వ్యర్థాలు వేయడం వల్ల విద్యార్థులు వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే అక్కడి నుంచి చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. నేతలు కృష్ణ, ఆంజనేయులు, వినయ్, నవీన్, జస్వంత్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ భూములను భూమి లేని నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గిరిజనులతో కలిసి ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధారి మండలంలోని మాతుసంగెం గ్రామ శివారులోని సర్వే నెంబర్-119, 175లో కొంతమంది పెత్తందారులు బోగస్ పట్టాలు సృష్టించుకుని నిరుపేదలు సాగు చేస్తున్న భూమి మాదేనని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి అని తేలితే నిరుపేదలకు పంచాలని విన్నవించారు. ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్, తదితరులున్నారు.



ఆర్డీవోకు వినతిపత్రమిస్తున్న సీపీఎం నేతలు

చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మాచారెడ్డి/బాన్సువాడ: పాత పెన్షన్ సాధన కోసం టీఎస్‌సీపీఎస్‌ఈయూ తలపెట్టిన చలో హైదరాబాద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం బాన్సువాడ, మాచారెడ్డి మండలాల్లో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



ఘన్‌పూర్‌లో ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అడ్డంగా ఉన్న ప్రచార హోర్డింగులను తొలగించాలి



రాజంపేట: మండల కేంద్రంలో సీపీఐ జెండా గద్దెలకు అడ్డంగా ఉన్న ప్రచార హోర్డింగ్‌లను తొలగించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్, ఎస్సైలకు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి బత్తుల ఈశ్వర్ మాట్లాడుతూ.. పార్టీ గద్దెలకు అడ్డంగా ఇలా అధికార పార్టీ నాయకులు ప్రచార హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం సరికాదని మండిపడ్డారు. వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

ట్రాన్స్‌కో కార్మికుల సమస్యలు పరిష్కరించండి



బాన్సువాడ : ట్రాన్స్‌కోలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీఆర్‌వీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో డీఈ కామేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకేఎస్ డివిజన్ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌కోలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు, అరియర్స్‌లు చెల్లించేలా కృషి చేయాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు.

సంక్షిప్తం

దివ్యాంగులకు ఇంటి వద్ద వ్యాయామాలు చేయించాలి

పెద్దకొగప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి వ్యాయామాలు చేయించారు. గంగాధర్, రాందాస్, రాథోడ్ బలరాం , కంపూటర్ ఆపరేటర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన సుచరితకు సన్మానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయికి చెందిన హోంగార్డు కూతురు మద్ది సుచరిత ఎస్సైగా ఎంపిక కావడంతో ఆమెను శుక్రవారం గ్రామ పెద్దలు సన్మానించి అభినందించారు.కార్యక్రమంలో సర్పంచ్ సంజీవులు, వీడీసీ చైర్మన్ మేకల రాజు, గ్రామ పెద్దలు గంగారం, యువకులు భరత్‌రావు, అనీల్, సుచరిత తండ్రి వివేకానందరెడ్డి తదితరులున్నారు.

పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని లక్ష్మాపూర్, కొట్టాల్, జాన్కంపల్లి గ్రామాలలో వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు వారు తెలిపారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో శుక్రవారం జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు చేతుల మీదుగా తపాల శాఖ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగుర వేయాలన్న లక్ష్యంతో తపాల శాఖ జాతీయ జెండాలను సరఫరా చేస్తోందని ఉద్యోగులు చెప్పారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సబ్ పోస్టు మాస్టర్ లింగొండ, బ్రాంచ్ పోస్టుమాస్టర్ రఘువీర్, తదితరులు ఉన్నారు.

బీసీలకు సైతం పోడు పట్టాలివ్వాలి

ఎల్లారెడ్డి: బీసీలకు సైతం ప్రభుత్వం పోడు భూముల పట్టాలను ఇవ్వాలని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాలను 2005 కంటే ముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో బీసీలకు సైతం ఇచ్చామని వ్యాఖ్యానించారు. భూములు లేని నిరుపేదలకు ప్రభుత్వం పోడు భూముల పట్టాలను ఇవ్వాలని అన్నారు.

రాజంపేట తహసీల్దార్ బదిలీ

రాజంపేట: రాజంపేట తహసీల్దార్ టి.శాంత ప్రమోషన్‌పై నిజామాబాద్ జిల్లాకు శుక్రవారం బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ సంతోషతో పాటు సహచర ఉద్యోగులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మొబైల్ ఫోన్ గుర్తింపు.. బాధితుడికి అప్పగింత

గాంధారి(ఎల్లారెడ్డి): సీఐఈఆర్ సహాయంతో పోయిన మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితుడికి శుక్రవారం అప్పగించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు..గండివేట్ గ్రామానికి చెందిన తన్నీరు సతీష్ రూ.26 వేల విలువైన మొబైల్ ఫోన్ పోయింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా విచారణ చేశారు. కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తి ఆ ఫోన్‌లో మరో సిమ్ కార్డు వేసి వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. సిబ్బంది రమేష్, భవితలను ఎస్సై అభినందించారు.